క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో 11 కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నందున సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

నల్లగొండ: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మృతి చెందిన దామరచర్ల మండలం జైత్రతండాకు చెందిన బాలింత ఆడావత్ రాజేశ్వరి కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ద్వారా ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, దామరచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు జూలకంటి సైదిరెడ్డి పాల్గొన్నారు.

కాశివారిగూడెం వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కలీం

తిప్పర్తి : మండలంలోని కాశివారిగూడెం గ్రామానికి చెందిన షేక్ కలీం గౌరవ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. 16 సంవత్సరాలుగా నేత్ర వైద్య సహాయ నిపుణుడిగా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అంధత్వ నిర్మూలనలో విశేష కృషి చేసినందుకుగాను మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటామర్ ఇంటర్నేషనల్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు హైదరాబాద్‌లో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో షేక్ కలీంకు డాక్టరేట్ పట్టా అందజేశారు.

మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

మునుగోడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్వరలో నిర్వహించే పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు కోరారు. పలువురు విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభమైన 1960వ సంవత్సరం నుంచి 2024 వరకు మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులంతా సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, నారమోయిన రవి, పాలకూరి నర్సింహ, పాల్వాయి చెన్నారెడ్డి, కర్నాటి స్వామి, భువనగిరి డీ.ఐ మాజీద్‌బాబా, బొడ్డు యాదయ్య, వెంకటేశ్వర్లు, మిర్యాల మధుకర్, రావిరాల కుమారస్వామి, ఉపేందర్ రెడ్డి, సంగిశెట్టి నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్

తిప్పర్తి : మండలంలో అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ట్రాక్టర్‌ను కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్‌కు కాలు విరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు కంటైనర్ వెళుతోంది. ఈ క్రమంలో దుప్పలపల్లి నుంచి అంతయ్యగూడెం వెళ్తున్న ట్రాక్టర్ యూటర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి కంటైనర్ ఢీకొంది. ఈ ఘటనలో కంటైనర్ డివైడర్ ఎక్కి రోడ్డు అవతలి వైపునకు తిరిగింది. అదే సమయంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న బస్సు కంటైనర్‌ను ఢీకొంది. దీంతో పాటు అదే సమయంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారు కూడా ట్రాక్టర్ ట్రాలీని ఢీకొంది. ఈ ప్రమాదంతో కంటైనర్ డ్రైవర్‌కు కాలు విరగడంతో 108 వాహనంలో నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. కంటైనర్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. తిప్పర్తి పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.



అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్

నత్తనడకన 'ఫ్లైఓవర్' పనులు



మర్రిగూడ బైపాస్ వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు



మర్రిగూడ బైపాస్ జంక్షన్

- ప్రమాదాలకు నిలయంగా మర్రిగూడ బైపాస్
- వన్‌వేలో రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

నల్లగొండ క్రైం: అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారిలో మర్రిగూడ బైపాస్ ప్రమాదాలకు నిలయంగా మారింది. నల్లగొండ పట్టణంలోకి వచ్చే మర్రిగూడ సర్కిల్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో ఒకే వైపు వాహనదారులు వెళ్లాల్సి ఉండడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. భారీ వాహనాలు మలుపు తిప్పుకునే సమయంలో బీటీ రోడ్డు కంకర తేలిపోతోంది. బ్రిడ్జి నిర్మాణ పనులు చేసే సమయంలో ఒక వైపు భూసేకరణ చేయకుండా పనులు చేట్టారు. దీంతో నల్లగొండ పట్టణంలోకి వచ్చే వాహనాలతోపాటు మిర్యాలగూడ వైపు వెళ్లే వాహనాలు సర్కిల్ వద్ద యూటర్న్‌తీసుకుని మళ్లీ అద్దంకి రోడ్డు ఎక్కాల్సి వస్తోంది. అదే సమయంలో నల్లగొండ పట్టణంలోకి వచ్చే వాహనాలు, పట్టణం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు సర్కిల్ వద్దే కలుస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి.

పూర్తికాని భూసేకరణ

హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్లే రోడ్డుకు ఎడమ వైపు భూసేకరణ చేయలేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో నల్లగొండ పట్టణం వైపు మాత్రమే వాహనాలను దారి మళ్లించి బ్రిడ్జి పనులు చేస్తుండడంతో వాహనదారులకు, పనులు చేసేవారికి ఇబ్బందికరంగా మారింది. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న క్రమంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ముందు జాగ్రత్తగా పెట్టకపోవడంతో దగ్గరకు వచ్చేంత వరకు బ్రిడ్జి పనులు జరుగుతున్న విషయం డ్రైవర్లు గమనించక అకస్మాత్తుగా వాహనాలు నిలపడంతో అదుపు తప్పి వాహనాలు బోల్తా పడుతున్నాయి. ఇటీవల కాలంలో ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు బోల్తా పడింది. వాహనాలు ఢీకొనడం, వాహనాల రద్దీ పెరగడం, దుమ్ము ధూళి, శబ్ద కాలుష్యంతో సమీప వ్యాపార సముదాయాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశాం



బైపాస్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాలు జరుగకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. ముందస్తుగా వాహనదారులు గమనించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశాం. ప్రమాదాలు జరగకుండా పోలీసులను నియమించాం.

–రాజు, ట్రాఫిక్ సీఐ

జరిగిన ప్రమాదాలు ఇవీ..

ఈ సంవత్సరం జనవరి 2న నార్కట్‌పల్లి నుంచి నల్లగొండ వస్తుండగా మర్రిగూడ బైపాస్ వద్ద కంటెయినర్ లారీ ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. అక్టోబరు 6న ఆరెంజ్ ట్రావెల్ బస్ బోల్తా పడి 10 మందికి గాయాలయ్యాయి. అక్టోబరు 18న తమిళనాడు నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు మట్టికుప్పను ఢీకొనగా కారు మొత్తం ధ్వంసమైంది. అనేక కార్లు యూటర్న్ తీసుకుంటున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించిన మర్రిగూడ సర్కిల్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

చిట్యాల: మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఆదివారం చిట్యాలలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులకు పీఆర్సీతోపాటు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, అర్హత కలిగిన కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జడల నర్సింహ, పాల లక్ష్మయ్య, బాకి అండాలు, మేడి శేఖర్, నల్ల శంకర్, మేడి శోభ, పద్మ, యమున, ధనలక్ష్మి, మల్లేష్, శ్రీకాంత్, దుర్గేష్, శంకర్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

నకిరేకల్ : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ మండలం కందిమల్లవారిగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాణాల రాంరెడ్డి పదవీ విరమణ సభ నకిరేకల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా రాంరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, కాంగ్రెస్ నేత దైద రవీందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిత్తలూరువాసికి తెలుగు విద్యారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రాచమల్ల శ్రీను

నకిరేకల్(శాలిగౌరారం): పుడమి సాహితీ వేదిక 6వ వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా ముదిగొండలో ఆదివారం జరిగిన «పుడమిరత్న జాతీయ విశిష్ట సేవా పురస్కారాలు–2024» కార్యక్రమంలో భాగంగా శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన రాచమల్ల శ్రీనుకు తెలుగు విద్యారత్న పురస్కారం దక్కింది. ఈ పురస్కారాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య, భక్త రామదాసు 10వ తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు చేతులమీదుగా రాచమల్ల శ్రీను అందుకున్నారు. విద్యార్థుల కెరీర్ డెవలప్‌మెంట్‌కు చేసిన కృషికిగాను తనకు పురస్కారం దక్కినట్లు శ్రీను తెలిపారు. రాచమల్ల శ్రీను ప్రస్తుతం రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ సమాచార శాస్త్రం విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, మానవ హక్కుల ప్రజాపరిరక్షణ సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ చలమాల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రామగిరి (నల్లగొండ): తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు అందించాలని, వివిధ కారణాలతో మరణించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. జంగయ్య, చావ రవి, బి.కొండయ్య, యస్.మహేష్, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకట్, శ్రీనివాసచారి, వెంకటేశం, క్రాంతి కుమార్, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పటాలే, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ మహోత్సవం



పడిపూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని 38వ వార్డు శివరాం నగర్ కాలనీలో ఆదివారం అయ్యప్ప పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన గురుస్వాములు ఆగు రాజు, మేడం విశ్వ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో లోకేష్, సతీష్, గిరి, రామన్న, భూపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దురాజ్‌పల్లి జాతరకు నిధులు కేటాయించాలి

వేములపల్లి(మాడుగులపల్లి) : సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు ప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలని గొర్రెల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి ఊరిబండి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం మాడుగులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని, జాతర సమయం దగ్గర పడుతున్నందున ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఊరిబండి సైదులు, తగుళ్ల వెంకన్న, కొమ్ము నాగయ్య, నాగరాజు, శివయాదవ్, అశోక్, వెంకన్న, లింగయ్య, కొండయ్య, వెంకన్న, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ లేక ప్రజల అవస్థలు !



అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై రోడ్డు వెంట నిలిచిన మురుగు

తిప్పర్తి : మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డు తిప్పలమ్మగూడం స్టేజీ సమీపంలో డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డు వెంట ఖాళీ స్థలంలో మురుగు నిలుస్తోంది. దీంతో రోడ్డు వెంట నివాస గృహాల వారు దుర్వాసనతోపాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ రోడ్డు విస్తరణ చేస్తున్న రోడ్డు కాంట్రాక్టు సంస్థ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టడం లేదు. తిప్పర్తి గ్రామపంచాయతీలోని సైదబాయిగూడెం ఎస్సీ కాలనీ, ఇతర కాలనీల మురుగు నీరు అంతా ఇక్కడే ఖాళీ స్థలంలో నిలుస్తోంది. ఇటీవల ఈ ప్రాంత ప్రజలు చికున్ గున్యా, వైరల్ ఫీవర్, ఇతర రోగాల బారిన పడి ఆస్పత్రులపాలయ్యారు. అధికారులు స్పందించి బైపాస్ రోడ్డు వెంట డ్రెయినేజీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సరిపడా నిధులు లేవు

తిప్పర్తి ఎస్సీ కాలనీ సమీపంలో డ్రెయినేజీ నిర్మాణానికి గ్రామపంచాయతీలో సరిపడా నిధులు లేవు. డ్రెయినేజీ నిర్మాణానికి ఎక్కువ నిధులు అవసరం. త్వరలో తిప్పర్తి మండల కేంద్రంలో సుందరీకరణ పనులు జరిగే సమయంలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, తిప్పర్తి ఎంపీడీఓ

దోమలు వస్తున్నాయి



డ్రెయినేజీ లేకపోవడంతో మా ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో మురుగు నిలుస్తోంది. దీంతో దోమలు విపరీతంగా వస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు వెంట డ్రెయినేజీ నిర్మించాలి.

– కొమ్ము గిరి, తిప్పర్తి ఎస్సీ కాలనీ

దుర్వాసన వస్తోంది



రోడ్డు వెంట మురుగు నిల్వ ఉండడం వల్ల రాత్రి సమయంలో దుర్వాసన వస్తోంది. ఊరిలోని మురుగంతా ఇక్కడే నిలుస్తోంది. డ్రెయినేజీ నిర్మించి మురుగు బయటకు వెళ్లేలా చూడాలి.

– వంగూరి రవి, ఎస్సీ కాలనీ తిప్పర్తి

ఉత్సవాలకు ఏసు నామకరణ చర్చి ముస్తాబు

- కమ్మగూడలో చర్చికి 77 ఏళ్ల చరిత్ర
- జనవరి 2న జాతర
- భారీగా హాజరుకానున్న క్రైస్తవ మతస్తులు



ఏసునామకరణ చర్చి



మరియామాత విగ్రహం



చర్చి ఆవరణ

మునుగోడు: మండల కేంద్రంలోని కమ్మగూడెంలో ఉన్న ఏసు నామకరణ దేవాలయం(చర్చి) ఉత్సవాలకు ముస్తాబయింది. శిథిలావస్థలో ఉన్న కమ్మగూడెం చర్చికి మూడేళ్ల క్రితం మరమ్మతులు చేపట్టారు. వివిధ రకాల డిజైన్లతో దాదాపు రూ.కోటి కి పైగా ఖర్చు చేసి చర్చిని అందంగా ముస్తాబు చేశారు.

1943లో చర్చి నిర్మాణం

మునుగోడు మండల కేంద్రంలోని కమ్మగూడెంలో గల ఏసు నామకరణ చర్చిని నిర్మించి ఇప్పటికి 77 ఏళ్లు పూర్తయ్యాయి. 1910లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా నుంచి 50 కుటుంబాలకు చెందిన కమ్మ కులస్తులు మునుగోడుకు వచ్చారు. అప్పటి నైజామ్ సర్కార్‌కు చెందిన 800 ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇక్కడే వ్యవసాయం చేస్తూ జీవనం సాగించడం మొదలుపెట్టారు. అప్పట్లో వారందరూ ఉండే చోట చిన్న కమ్మల గుడిసెలో ఏసు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని ప్రార్థనలు చేసేవారు. విషయం తెలిసిన ఇటలీ దేశస్తుడు ఫాదర్ పేనేల్లి మునుగోడుకు వచ్చి ఇక్కడ చర్చి కడతామని, అందుకు గ్రామస్తుల సహకారం కావాలని కోరడంతో అందరూ ఒప్పుకున్నారు. దీంతో నాలుగు ఎకరాల స్థలంలో 1943వ సంవత్సరంలో 100 ఫీట్ల పొడవు, 30 ఫీట్ల వెడల్పు, 60 ఫీట్ల ఎత్తులో అత్యంత పెద్ద చర్చిని నిర్మించడం మొదలుపెట్టారు. నాలుగేళ్లకు పూర్తి చేశారు. ఏసు పుట్టిన డిసెంబర్ 25 తరువాత 9 రోజులకు నామకరణం చేయడంతో జనవరి 2న పనులు మొదలు పెట్టి ఆ చర్చికి ఏసునామకరణ దేవాలయం అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఆ చర్చి జిల్లాలోని పెద్ద చర్చిల్లో ఒకటిగా నిలిచింది. ఈ చర్చిలో ఆ ప్రాంతంలోని దాదాపు 150 కుటుంబాలకు చెందిన క్రైస్తవ మతస్తులు నిత్యం ప్రార్థనలు చేస్తుంటారు.

నాలుగు రోజులు జాతర

ప్రతి ఏడాది మాదిరిగానే జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు చర్చిని ముస్తాబు చేశారు. డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగను గ్రామస్తులు అందరిలా జరుపుకుంటారు. జనవరి 2న ఏసు క్రీస్తుకు నామకరణం చేసినందున ఆరోజు నుంచి ప్రతి ఏడాది ఈ చర్చిలో పండుగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జనవరి 1, 2 తేదీల్లో రెండు రోజులపాటు గ్రామంలోని క్రైస్తవ మతస్తులు చర్చిలోని బాల ఏసు విగ్రహాలను బ్యాండు చప్పుళ్లతో తమ ఇళ్లలోకి తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. సాయంత్రం సమయంలో చర్చి వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫాదర్లు, బిషప్‌లు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ సందర్భంగా చర్చి వద్ద 2వ తేదీన జాతర జరుగుతుంది. జాతరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన హిందువులు కూడా భారీగా తరలివచ్చి చర్చిలో కొవ్వత్తులు వెలిగించి ఏసుక్రీస్తు విగ్రహం వద్ద ఉంచుతారు. అనంతరం చర్చి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆ రెండు రోజులు కమ్మగూడెం ప్రజలు తమ బంధువులను, స్నేహితులను పిలుచుకుని వేడుకలు జరుపుకుంటారు. మిగతా రెండు రోజులు చర్చిలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

తాటి చెట్టే కరెంట్ స్తంభం !



తాటిచెట్టుకు కట్టిన విద్యుత్ తీగలు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ నుంచి ఇప్పగూడెం వెళ్లే దారి పక్కన పంట పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈదారి గుండా మండలంలోని కొర్లపహాడ్, ఇప్పలగూడెం, గుడివాడ, కాసనగోడు, బొప్పారం, నకిరేకల్ మండలంలోని నోముల, వల్లభాపురం తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తుంటారు. విద్యుత్ స్తంభాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు పక్కనే ఉన్న తాటిచెట్టును కరెంటు స్తంభంగా మార్చుకున్నారు. కిందకు వేలాడున్న త్రీఫేజ్ విద్యుత్ తీగలను పైకి లాగి తాటిచెట్టు వేలాడదీశారు. అక్కడి నుంచి రెండు వందల ఫీట్ల దూరంలో పొలంలో మరో కర్రను పాతి విద్యుత్ తీగలను పైకెత్తారు. వర్షాలు కురిసినప్పుడు తాటిచెట్టు తడిసిపోయి విద్యుత్ భూమి మీదకు ప్రసరించే అవకాశముంది. గాలి వీచి కర్ర విరిగినట్లయితే విద్యుత్ తీగలు కిందపడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయండి

మునుగోడు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని ఎంపీడీఓ విజయభాస్కర్ సిబ్బందికి సూచించారు. ఆదివారం మునుగోడు, సింగారం, ఊకొండి, పులిపలుపుల గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తుదారుడి ఇంటి వద్దకు వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా చూడాలన్నారు. ఈ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గోదాదేవి వేషధారణ పోటీలు



బహుమతులు అందజేస్తున్న ప్రవచనకర్త శ్రీభాష్యం జగన్నాథాచార్యులు



గోదాదేవి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా రామగిరిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం చిన్నారులకు గోదాదేవి వేషధారణ పోటీలు నిర్వహించారు. ప్రవచనకర్త శ్రీభాష్యం జగన్నాథాచార్యులు, కౌన్సిలర్ బుర్రి చైతన్యశ్రీనివాస్‌రెడ్డి, వికాస తరంగిని సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, సుజాత, మాధవి, ఆలయ మాజీ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ